

ఆస్పత్రి భవన నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి



పీహెచ్‌సీలో మందులను పరిశీలిస్తున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

చందుర్తి, జూన్ 20: చందుర్తిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో నూతన భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్ ను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. అనంతరం పీహెచ్‌సీ లోని మందుల గది, రక్త పరీక్షల గది, ఇన్వార్డ్‌ను పరిశీలించారు. సీజనల్ వ్యాధుల కు సంబంధించిన మందులు, యాంటి వీనం, రెబీస్ నివారణ అందుబాటులో ఉన్నాయా? అని మెడికల్ ఆఫీసర్ సంపత్‌ను అడిగి తెలుసుకు న్నారు. కంటి వైద్య పరీక్షలు చేసే గదిని పరిశీలిం చారు. దవాఖానాకు రోజూ ఎంత మంది రోగులు వస్తున్నారని వివరాలు తెలుసు కున్నారు. ఆసుపత్రి ఆవరణలో పరిసరాలు శుభ్రంగా ఉండాలని, నీరు నిల్వ ఉండకుండా జాగ్రతలు తీసుకోవాలని మెడికల్ ఆఫీసర్‌ను ఆదేశించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో ప్రదీప్, ఎంపిటిసి రేణుక, తదితరులు ఉన్నారు.

చేప పిల్లల పంపిణీపై నీలినీడలు





- ఇంకా ప్రభుత్వం నుంచి రాని స్పష్టత
- గత సంవత్సరం 1.41 కోట్ల చేప పిల్లల పంపిణీ
- ఈ యేడాది టెండర్ ప్రక్రియ లేదు
- జిల్లా వ్యాప్తంగా 138 మత్స్య పారిశ్రామిక సంఘాలు... 8820 మంది సభ్యులు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

మత్స్యకారులకు ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు నీలి విప్లవాన్ని సాధించే దిశగా గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన ఉచిత చేపపిల్లల పంపిణీ పథకంపై ఈసారి నీలినీడలు కమ్ముకున్నాయి. గత సంవత్సరమే టెండర్ల ప్రక్రియ చేపట్టాల్సి ఉండగా ఎన్నికల కోడ్, ఇతర కారణాలతో నిలిచిపోయినట్లుగా భావిస్తున్నారు. ఎన్నికల కోడ్ ముగిసిపోయినా కొత్త ప్రభుత్వం నుంచి ఉచిత చేపపిల్లల పంపిణీపై స్పష్టత లేకపోవడంతో ఈసారి ఉచిత చేపపిల్లలు లేవనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మరోవైపు ప్రభుత్వం ఉచిత చేపపిల్లల పంపిణీపై ఆలోచన చేస్తున్నట్లుగా ప్రజాప్రతి నిధులు, అధికారులు భావిస్తున్నా అలస్యంగా విత్తనాలు వేస్తే ఎదుగుదల కూడా కష్టమేనని మత్స్యకారులు తెలుపుతున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో కాళేశ్వరం ఎత్తిపోతలతో శ్రీరాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్ట్, అన్నపూర్ణ, అనంతగిరి ప్రాజెక్ట్, ఎగువ మానేరు ప్రాజెక్ట్‌తో పాటు చెరువులు, కుంటల్లో నీళ్లు మండుటెండలోనూ జలకళ ఉండడంతో సకాలంలోనే చేప పిల్లల పంపిణీ గతంలో చేపట్టారు.

ఈ సారి కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో ఏర్పడ్డ అవాంతరాలతో ఎత్తిపోతలు నిలిచిపోయాయి. మిడ్‌మానేరు, అన్నపూర్ణ ప్రాజెక్ట్‌లతో పాటు చెరువులు, కుంటల్లో నీళ్ల డెడ్‌స్టోరేజీకి చేరుకున్నాయి. వర్షాలు సమృద్ధిగా కురుస్తేనే నీళ్ల వచ్చే పరిస్థితులు ఉన్నా యి. వానాకాలం సీజన్ ప్రారంభమైన దృష్ట్యా మళ్లీ ప్రాజెక్ట్‌లోకి, చెరువుల్లోకి నీళ్ల వచ్చే సమయం ఆసన్నమైనా ఉచిత చేప పిల్లల పథకానికి సంబంధించి టెండర్లు లేకపోవడంతో పంపిణీ, ఉంటుందా లేదా అనే సందేహాలు మత్స్యకారుల్లో ఏర్పడ్డాయి.

గత సంవత్సరం 1.41 కోట్ల చేప పిల్లల పంపిణీ...

ఎనిమిది సంవత్సరాలుగా రాజన్నసిరిసిల్ల జిల్లాలో ప్రాజెక్ట్‌లు, చెరువులు, కుంటల్లోకి వందశాతం ఉచితంగా చేపపిల్లల పంపిణీ జరుగుతుంది. 2023-24 సంవత్సరానికిగాను జల్లాలోని 440 సొసైటీల పరిధిలోని చెరువుల్లో 1.41 కోట్ల చేప పిల్లలను పంపిణీ చేశారు. మూడు రిజర్వాయర్‌లలో 44.80 లక్షల రొయ్యలను వదిలారు. జిల్లాలో యాక్షన్ ప్లాన్ ప్రకారం వర్షాకాలంలో ప్రతియేటా 35-40 ఎంఎం సైజు చేప పిల్లలు 68 లక్షలు, 80-100 ఎంఎం చేపలు 71 లక్షలు వదిలారు. ఈ సారి చేపపిల్లలు వదులుతారా పథకాన్ని ఎత్తివేస్తారా అనే సందిగ్ధం కూడా ఏర్పడింది.

జిల్లాలో ఎన్నెన్నో రకాల చేపలు...

మనుషుల జీవనంలో ఆహారంలో ముఖ్యమైన వాటిలో చేపలు కూడా ఒకటి. ఆ చేపలను విభిన్న రుచుల్లో ఆస్వాధించడం జరుగుతుంది. ఎన్ని కష్టాలు వచ్చినా చెరువులనే నమ్ముకొని జీవనం సాగిస్తున్న మత్స్యకారులు తమ కుటుంబాలను పోషించుకోవడానికి కష్టాలు పడుతూనే ఉన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో మిడ్ మానేరు, అన్నపూర్ణ ప్రాజెక్ట్‌లతో పాటు కాళేశ్వరం ఎత్తిపోతలతో ఎన్నెన్నో రకాల చేపలు జిల్లా ప్రజలకు చేరువయ్యాయి.

తెలంగాణ చేప కొర్రమట్ట

బొమ్మె, కొర్రమట్ట, కొర్రమీను, మొట్ట, మరల్ ఇలా వివిధ పేర్లలో పిలిచే చేపలో వీటినే రారాజుగా పిలుస్తారు. తెలంగాణ ప్రభుత్వం కూడా గుర్తింపును ఇచ్చింది. కొన్ని చోట్ల చేపలను గాలం ద్వారా పట్ట డానికి ఎరగా కప్పలను ఉపయోగిస్తారు. వీటిని కప్ప గాలాలుగా పిలుస్తారు. ఎర్రలకు ఈ చేపలు పడవు. కప్పలు నీటి పైభాగాన తేలేటట్లు ఉబ్బిస్తారు. అలా ఉబ్బిన కప్ప తేలుతూ కదులుతూ ఉంటుంది. మరల్ వచ్చి దాన్ని నోట కరుచుకుంటుంది. చేపను కూడా అదే పద్ధతిలో పడుతారు. చిన్న రకం చేపలను వలతో పడతారు.

జిల్లాలో మత్స్య సహకార పరిస్థితి ఇది...

రాజన్న సిరిసిల్ల జిల్లాలో మత్స్య కారులు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో నిత్యం నీటిపై పోరాటం చేస్తూ ఉపాధిని అందుకుంటున్నారు. జిల్లాలో మత్స్య శాఖ పరిధిలో 440 చెరువులున్నాయి. 138 మత్స్య పారి శ్రామిక సహకార సంఘాలు ఉండగా 8,820 మంది సభ్యులున్నారు. 20 మహిళ మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు, రెండు ప్రాథమిక సహకార సంఘాలున్నాయి. గత ఆర్థిక సంవత్సరం వరకు మిడ్ మానేరులో చేపలు పట్టడానికి 618 మంది మత్స్యకారులకు, ఎగువ మానేరు ప్రాజెక్ట్‌లో 265 మంది, అన్నపూర్ణ ప్రాజెక్ట్‌లో 226 మంది మత్స్య కారులకు లైసెన్స్‌లు జారీ చేశారు.

సమీకృత మత్స్య అభివృద్ధి పథకం కింద జిల్లాలో 75 శాతం సబ్సిడీతో 1,094 మందికి చేపలు అమ్ముకోవడానికి వాహనాలను అందించారు. ఉచిత చేపపిల్లల పంపిణీకి సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి నిర్ణయం రాకపోవడంతో మత్స్యకారుల్లో ఆందోళనలు ఏర్పడ్డాయి.

సంవత్సరం	జలాశయాలు	వదిలినవి(లక్షల్లో)
2016- 17	92	30.5
2017- 18	66	20.0
2018- 19	95	57.48
2019- 20	31	100.91
2020- 21	362	115.61
2021- 22	392	119.25
2022 -23	392	138.27
2023 -24	440	141.00

నేడు అర్బన్ బ్యాంక్ పాలకవర్గ సభ్యులకు సన్మానం

- పాల్గొననున్న మాజీ మంత్రి కేటీఆర్

సిరిసిల్ల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల సహకార అర్బన్ బ్యాంక్ ఎన్నికల్లో బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులు ఘన విజయం సాధించి బ్యాంక్ చైర్మన్, పాలకపగ్గాలను కైవసం చేసుకున్న నేపథ్యంలో శుక్రవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మాన కార్యక్రమం చేపట్టారు. సిరిసిల్లలోని పద్మశాలి కల్యాణ భవనంలో బీఆర్ఎస్‌కు చెందిన అర్బన్ బ్యాంక్ చైర్మన్, వైస్‌చైర్మన్, పాలకవర్గ సభ్యులను బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కేటీఆర్ సన్మానించనున్నారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ శ్రేణులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి కోరారు.

శ్రీవాణి పబ్లిక్ స్కూల్‌కు నోటీసులు

ముస్తాబాద్ జూన్ 20 : మండల కేంద్రంలోని శ్రీవాని పబ్లిక్ స్కూల్‌కు నోటీసులు అందించినట్లు మండల విద్యాధికారి బన్నాజీ గురువారం తెలిపారు. స్థానికంగా ఏడాది క్రితం ఏర్పాటు చేసిన శ్రీవాణి యూపీఎస్ స్కూల్‌కు ప్రారంభ అనుమతి ఉన్న పర్మనెంట్ అనుమతులు కావాలని పలుమార్లు కోరినా చూపించకపోవడంతో నోటీసులు అందించారు. ఈనెల 22 వతేదీ లోగా సమాధానం ఇవ్వాలని ఆదేశించారు.

గిర్జాజనైన విద్యార్థులపై ఉపాధ్యాయుడి ప్రత్యేక దృష్టి

- ఇంటికి వెళ్లి ద్విచక్రవాహనంపై తీసుకెళ్తున్నవైనం



కోనరావుపేట, జూన్ 20: అతనో ప్రభుత్వ ఉపాధ్యాయుడు. విద్యార్థులు పాఠశాలకు రావడంలేదని అలానే ఉండిపోలేదు. గిర్జాజనైన విద్యార్థుల ఇంటికి వెళ్లి స్వయంగా తన ద్విచక్రవాహనంపై పాఠశాలకు తీసుకెళ్తున్నాడు. కోనరావుపేట మండలం సుద్దాల ఎంపీపీఎస్ పాఠశాలలో చేరాల శ్రీనివాస్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. ఆ పాఠశాలలో సుమారు 20 మంది విద్యార్థులకు పైగా చదువుతున్నారు. ఇద్దరు ఉపాధ్యాయులు ప్రస్తుతం పనిచేస్తున్నారు. ఈ 20 మంది విద్యార్థుల్లో ఏ ఒక్క విద్యార్థి గిర్జాజరైనా వారి ఇంటి వద్దకు వెళ్లి తల్లిదండ్రులను ఒప్పించి తన బైక్‌పై పాఠశాలకు తీసుకు వెళ్లి విద్యాబోధన చేస్తున్నాడు. గురువుగా విద్యార్థుల పై చూపుతున్న శ్రద్ధను గ్రామస్థులు అభినందిస్తున్నారు.

గురుకుల పాఠశాలల్లో నాణ్యమైన విద్య

- ప్రైవేటు స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ స్కూళ్ల బలోపేతం - ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



జ్యోతిబా పూలేలో పాఠశాలలో భోజనం చేస్తున్న ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, జూన్ 20: రాష్ట్ర ప్రభుత్వం గురుకుల పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. జాతీయ నులుపురుగల నివారణ దినోత్సవం సందర్బంగా వేములవాడ పట్టణంలోని మహాత్మజ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ రెసిడెన్షియల్, బాల, బాలికల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురకుల పాఠశాల, బాలబాలికల కస్తూర్బాగాంధీ విద్యాలయంలో విద్యార్థులకు గురువారం నులిపురుగు నివారణ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలలో తనిఖీ చేసి తన దృష్టికి వచ్చిన పలు సమస్యల పరిష్కారానికి హామీచ్చారు. విద్యార్థులతో కాసేపు ముచ్చటించి ఎలాంటి సమస్యలు వున్న ఉపాధ్యాయులు లేదా తన దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ 19 సంవత్సరాలు వయస్సుగల పిల్లలందరు తప్పకుండా నులిపురుగు నివారణ మాత్రలను వేసుకోవాలని అన్నారు. శారీరకంగా బలంగా ఉన్నప్పుడే మనం చదువులో రాణించగలుగుతామన్నారు. నులిపురుగుల ద్వారా పిల్లల్లో శారీరక ఎదుగుదల ఉండదని, వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పకుండా నలిపురుగుల నివారణ మాత్రలు వేయించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గురుకులలో నాణ్యమైన విద్యను అందిస్తుందని వివరించారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఉండి పుస్తకాలపై దృష్టిసారించి కష్టపడి చదవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రైవేట పాఠశాలలకు ధీటుగా ఉంటారని రవీంద్రభారతిలో గత సంవత్సరం పదో తరగతిలో 10 జీపీఏ తెచ్చుకున్న విద్యార్థులను ఘనంగా సన్మానించారని సూచించారు. వేములవడ పరిధిలో 10 జీపీఏ తీసుకువచ్చుకునే విద్యార్థులను సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానిస్తామని హామీచ్చారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో సుమన్‌మోహన్‌రావు, ఆర్డీవో రాజేశ్వర్, టౌన్ సీఐ వీరప్రసాద్, మున్సిపల్ కమిషనర్ తదితరులు ఉన్నారు.

సంకెపల్లి ప్రభుత్వ పాఠశాలలో..

వేములవాడ మండలం సంకెపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్రలను గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బుర్ర లహరికోశఖర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

'యోగా'నందం



- మానసిక ఒత్తిడిని అధిగమించే శక్తి
- సంపూర్ణ ఆరోగ్యానికి దివ్యఔషధం
- జిల్లాలో యోగా శిక్షణ శిబిరాలు
- నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

మనిషి జీవితంలో మానసిక ప్రశాంతత శారీరక ఆరోగ్యం, ఆత్మ విశ్వాసం, ఏకాగ్రత ఉంటే రోజంతా హాయిగా గడిచిపోతుంది. ప్రస్తుత పరుగుల జీవితంలో హాయి అనే మాట వినిపించడం లేదు. పెరుగుతున్న మానసిక ఒత్తిడి మనిషిని అనేక అనర్థాలకు సమస్యల్లోకి నెట్టివేస్తుంది. మన జీవన విధానంలో చివరకు ఇబ్బందిపడేది అనారోగ్య సమస్యలతోనే. దీని విరుగడుకు ఏకైక మార్గం యోగా అని చెప్పవచ్చు. ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచడమే కాకుండా ఏకాగ్రతను పెంపొందించే మన ప్రాచీన భారతీయ యోగాకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉంది. ప్రాచీన వారసత్వానికి వారధిగా నిలిచినవి యోగాసనాలే. వేల సంవత్సరాల క్రితం పతంజలి మహర్షి మానవ శరీర నిర్మాణం రహస్యాలను ఆవిష్కరించారు. శరీర ధర్మాలను అధ్యాయనం చేసి ఆరోగ్యం కోసం యోగాసనాలను అందించారు. ప్రాణాయామం, సూర్యనమస్కారాలు, యోగాసనాలు, యోగ విద్యలో కీలకం. పతంజలి తరువాత ఎందరో మహర్షులు దీనిని శాస్త్రీయతను కల్పించారు. ఈప్రాచీన విద్యకు ఇప్పటికే అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు ఉండగా, ఐక్యరాజ్యసమితి జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించింది. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ఇందిరా పార్కులో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా అయుష్, యోగా సాధన సమితి ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని శుక్రవారం ఉదయం 6.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుమన్‌మోహన్‌రావు, అయుష్ నోడల్ అధికారి డాక్టర్ నీరజ తెలిపారు. యోగా అభిమానులు, సాధకులు హాజరు కావాలని కోరారు. దీంతో ప్రాచీన విజ్ఞానానికి అరుదైన గుర్తింపుగా భావిస్తున్నారు. ఐక్యరాజ్యసమితి గుర్తింపుతో జిల్లాలో యోగా పట్ల ఆసక్తి కూడా పెరిగింది. మనిషి ఆరోగ్యాన్ని, అశాంతిని దూరం చేసే యోగ విద్య ఉపయోగాల్లోకి వెళితే ఎన్నో ఆసక్తికరమైన అంశాలు తెలుసుకోవచ్చు.

యోగా వల్ల ప్రయోజనాలు..

మానసిక ప్రశాంతత, శారీరక ఆరోగ్యానికి యోగా దివ్య ఔషధంగా చెప్పుకోవచ్చు. వయస్సుతో సంబంధం లేకుండా యోగాను అభ్యసించవచ్చు. యోగాలో ఎనిమిది రకాలు చెప్పుకోవచ్చు. యమము, నియమం, ఆసనం, ప్రాణాయామం, ప్రత్యాహారం, ధారణం, ధ్యానం, సమాధి. యోగ సాధనంలో ప్రధానంగా పాటించాల్సిన అంశాల్లో యమ నియమాలు, ఆసన ప్రాణాయామాలు ముఖ్యమైనవి. వజ్రాసనం, సిద్ధాసనం, పద్మాసనం, సర్వంగాసనం, శిర్షాసనం, అర్థమయూరాసనం, ఉపవిష్టకోనాసనం, గరుడాసనం, చక్రాసనం, కటిచక్రాసనం, వ్యాగ్రాసనం, ప్రాణాయామం, వృక్షాసనంలతో పాటు సూర్య నమస్కారాలు, తడాసనం, పాదహస్తాసనం, ఏకపాద కుంచిత సరళ భుజంగాసనం, ఊర్థ్వ చక్రాసనం, సాష్టాంగ నమస్కారాసనం, భుజంగాసనం, ఊర్థ్వ చక్రాసనం ముఖ్యమైనవి.

యోగా దినోత్సవ నేపథ్యం

2015 ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో ప్రధాని మోదీ యోగాను అంతర్జాతీయ గుర్తింపు ఇవ్వాలని తీర్మాణం చేశారు. 170 దేశాలు మద్దతునిచ్చాయి. ప్రపంచ ఆరోగ్య విదేశీ విధానం కింద ఐక్యరాజ్యసమితి జూన్ 21న యోగా దినంగా ప్రకటించింది. జూన్ 21కి ఉన్న నేపథ్యం ఏమిటని చర్చనీయాంశంగా మారింది. దక్షిణాదివారి లెక్క ప్రకారం దక్షిణాయనం జూలైలో మొదలవుతుంది. కానీ ఉత్తరాదివారి సాయాన పద్ధతిలో దక్షిణాయనం కర్కట సంక్రాంతి జూన్ 21నే మొదలవుతుంది. సాయాన పద్ధతి ప్రకారం సూర్యుడు ఉత్తరాయణంలో ఉచ్ఛదశకు చేరుకునే రోజు. సంవత్సరం మొత్తం మీద పగలు ఎక్కువగా ఉండే రోజు కూడా ఇది. అందుకే ఈ రోజుకు ఈ ప్రత్యేకత. దక్షిణాయనంలో పండుగలు, వ్రతాలు ఆచరించడం ఎక్కువగా కనపడుతుంది. చతుర్మాస్య వ్రతం, వినాయక చవితి, మంగళగౌరి వ్రతాలు, దసరా, దీపావళి వంటి పండుగలు దక్షిణాయనంలో వస్తాయి. అందుకే ఆధ్యాత్మికంగా ఉత్తమమైనదిగా అర్థం చేసుకోవచ్చు. దీంతోపాటు జూన్ 21న లాత్వియన్లు ఈ రోజును జానీగా పేర్కొంటూ పండుగలు జరుపుకుంటే, ఎస్తోనియన్లు జానీపేవ్‌గా జరుపుకుంటారు. యురోపియన్లు మిడ్‌సమ్మర్‌గా వ్యవహరిస్తారు. ఇలా ప్రపంచ వ్యాప్తంగా జూన్ 21కి ప్రాధాన్యత ఉండడంతోన యోగా దినంగా నిర్ణయించారని భావిస్తున్నారు.

మహిళలకు యోగాసనాలు ఎంతో ఉపయోగకరం

- డాక్టర్ శ్రీవాణి



యోగాసనాలు వ్యాధుల నియంత్రణకు దోహద పడుతాయి. ముఖ్యంగా మహిళలకు యోగాసనాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. యోగాలో సైన్స్ ఉందని శాస్త్రవేత్తలు, వైద్యులు ఇప్పటికే గుర్తించారు. యోగాసనాల్లో శరీరం మొత్తం మీద ప్రభావం చూపుతుంది. యోగాతో శరీరంలోని అన్నిభాగాల్లో నెమ్మదిగా కదలిక ఏర్పడుతుంది. ఆరోగ్యాన్ని ఇస్తుంది.

శారీరక, మానసిక ఉత్తేజం


- ఆడెపు రవీందర్, అధ్యక్షుడు పతంజలి యోగా సమితి



యోగా శారీరకంగా, మానసికంగా ఉత్తేజాన్ని ఇస్తుంది. ఆసనాల్లో నియమాలు పాటిస్తే మెరుగైన ఫలితాలు ఉంటాయి. యువకులు తక్షణ ఫలితం కోసం చూస్తున్నారు. యోగా వల్ల అలస్యం అయిన ఆరోగ్యకరమైన జీవితాన్ని పొందగలుగుతారు. ఆసనాలను నిత్యం పాటించాలి.












సినిమా వార్తల కోసం
www.andhrajyothy.comను క్లిక్ చేయండి







ఇసుక లారీ పట్టివేత

గన్నేరువరం, జూన్ 20: తిమ్మాపూర్ మండలం రేణిగుంట గ్రామ శివారు లో అక్రమంగా ఇసుకను డంపు చేసి ఎక్స్‌కావేటర్ సహాయంతో లోడ్ చేసి హైదరాబాద్‌కు తరలిస్తున్న తరలిస్తున్న లారీని గురువారం మండలంలోని గుండ్లపల్లి స్టేజి వద్ద పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు లారీని, ఎక్స్‌కా వేటర్‌ను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. లారీ డ్రైవర్ కోరపు సంపత్‌రెడ్డి, ఎక్స్‌కావేటర్ ఆపరేటర్ మెండ శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకు న్నారు. లారీ యజమాని కొండుగారి తిరుపతిరెడ్డి, ఎక్స్‌కావేటర్ యజమాని గూడెల్లి నరేష్, ఇసుక డంపు చేయించిన చింతల అనిల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తాండ్ర నరేష్ తెలిపారు.





100 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

ధర్మారం,జూన్20: ధర్మారం మండలం నర్సింహులపల్లి గ్రామంలో గురువారం అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యంను పౌరసరఫరాల శాఖ, టాస్క్ ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో నర్సింహులపల్లి గ్రామంలోని ఎల్లమ్మ దేవాలయం సమీపంలో 100క్వింటాళ్ల రేషన్ బియ్యంను పట్టుకున్నట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ప్రేమ్‌కుమార్ చెప్పారు. పంచనామా చేసి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద బియ్యంను భద్రపరిచినట్లు తెలిపారు. ఈ తనిఖీలో సంబంధిత అధికారులు ఉన్నారు.

పీజీ పరీక్ష రుసుం గడువు 28 వరకు

గణేశ్‌నగర్,జూన్ 20: ఎం.ఏ, ఎం.కాం, ఎమ్మెస్సీ, ఎం.ఎస్.డబ్ల్యూ,ఎం.బీ.ఏ, ఎం.సీ.ఏ నాలుగో సెమిస్టర్ విద్యార్థులు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా పరీక్ష రుసుం చెల్లించడానికి జూన్ 28వ తేదీ వరకు తుది గడువు అని ఎస్‌యూ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్‌వి శ్రీరంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 300/- రూపాయల అపరాధ రుసుంతో జూలై నెల 2వ తేదీ వరకు చెల్లించవచ్చని తెలిపారు. పరీక్షలను జూలైలో నిర్వహించనున్నారు.

డిగ్రీ పరీక్షల్లో ముగ్గురు విద్యార్థుల డీబార్

గణేశ్‌నగర్, జూన్20: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న డిగ్రీ రెండవ, నాలుగవ సెమిస్టర్ పరీక్షల్లో గురువారం ముగ్గురు విద్యార్థులు మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడటంతో వారిని డీబార్ చేసినట్లు శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్వి శ్రీరంగప్రసాద్ తెలిపారు. శ్రీ చైతన్య డిగ్రీ, పీజీ కళాశాల కరీంనగర్‌లో ఒకరు, వాగ్దేవి డిగ్రీ కళాశాల వేములవాడలో ఒకరు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిరిసిల్లలో ఒకరు, మొత్తం ముగ్గురు విద్యార్థులు డీబార్ అయినట్లు తెలిపారు.

ట్రాక్టర్ పైనుంచి పడి పంచాయతీ కార్మికుడి మృతి


పోచయ్య(ఫైల్)

వేములవాడ రూరల్, జూన్ 20: ప్రమాదవశాత్తు ట్రాక్టర్ పైనుంచి పడి పంచాయతీ కార్మికుడు మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. నూకలమర్రి గ్రామానికి చెందిన గసికంటి పోచయ్య(63) గ్రామ పంచాయతీలో తాత్కాలిక కార్మికుడిగా మూడు సంవత్సరాలుగా పనిచేస్తున్నాడు. గురువారం చెత్త సేకరణలో భాగంగా ట్రాక్టర్‌పై వెళ్తుండగా మూలమలుపు వద్ద ట్రాక్టర్ అదుపుతప్పి స్తంభాన్ని ఢీకొట్టడంతో పోచయ్య ట్రాక్టర్ పైనుంచి కింద పడ్డాడు. తలకు తీవ్రగాయం కావడంతో గమనించిన స్థానికులు వేములవాడ ఏరియా ఆసుపత్రికి తీసుకువచ్చారు. పరిస్థితి విషమించడంతో కరీంనగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు, కార్మికులు కోరుతున్నారు. కాగా మృతుడు గసికంటి పోచయ్య కుటుంబానికి తక్షణ సాయం కింద కలెక్టర్ సందీప్ కుమార్ ఝా 50,000 రూపాయల చెక్కును రూరల్ తహసీల్దార్ సుజాత ద్వారా అందజేశారు.

కార్మికుడి కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలి

- సీఐటీయూ, ఏఐటీసీయూ ధర్నా

సిరిసిల్ల టౌన్: నూకలమర్రి గ్రామ పంచాయతీ కార్మికుడు గసికంటి పోచయ్య కుటుంబానికి ప్రభుత్వం వెంటనే పది లక్షల రూపాయల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం సిరిసిల్ల పట్టణం జిల్లా ప్రధాన వైద్యశాల ఆవరణలో సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు, జీపీ కార్మికులు ధర్నా చేపట్టారు. సంఘటన స్థలానికి చేరుకున్న డీఎల్‌పీవో నరేష్ సీఐటీయూ, ఏఐటీయూసీ, జీపీ వర్కర్స్ యూనియన్ నాయకులతో మాట్లాడారు. పోచయ్య కుటుంబానికి పది లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కార్మిక సంఘ నాయకులు డిమాండ్ చేశారు. డీఎల్‌పీవో నరేష్ జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి దహన సంస్కారానికి రూ.10 వేలు అందజేశారు. నష్టపరిహారంగా ఐదు లక్షల రూపాయల వరకు అందించేలా చూస్తామని డీఎల్‌పీవో హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం డీఎల్‌పీవో నరేష్‌కు కార్మిక సంఘాల నాయకుడు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మల్యాల నర్సయ్య, కార్యదర్శి అన్నల్‌దాస్ గణేష్, నాయకులు లింగంపల్లి కృష్ణవేణి, గంగరాజు, మహేష్, శ్రీనివాస్, రవీందర్, శేఖర్ పాల్గొన్నారు.


డీపీఎల్‌వోకు వినతిపత్రం అందజేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

చిగురుమామిడి, జూన్ 20: మండలంలోని ముదిమాణిక్యం గ్రామ శివారులో కారు (టీఎస్11ఈజే3274) అతివేగంతో చెట్టును ఢీకొట్టిన ప్రమాదంలో గాయపడ్డ నీలాంబర (38) అనే వ్యక్తి గురువారం మృతి చెందినట్లు ఎస్సై బండి రాజేశ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. బెజ్జంకి మండలానికి చెందిన ముక్కిస నీలాంబర అనే వ్యక్తి బుధవారం ముదిమాణిక్యం నుంచి వెళుతుండగా కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమ్మత్తం కరీంనగర్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. నీలాంబర భార్య అనూష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి మృతి

వీణవంక, జూన్ 20: పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన వీణవంక మండలంలోని మామిడాలపల్లికి చెందిన సింగరవేని తిరుపతి (33) అనే యువకుడు చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుపతి హార్వెస్టర్ నడుపుతూ జీవించేవాడని మద్యానికి బానిసై 15వ తేదీన పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు కరీంనగర్‌లో ఓ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందినట్లు తెలిపారు.మృతుని భార్య రక్షిత పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

పెద్దపల్లి రూరల్,జూన్ 20: కమాన్‌పూర్ మండలం కిష్టంపల్లి గ్రామానికి చెందిన అక్షయ్ కుమార్ (20) సబ్బితం గ్రామ శివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉపాధి నిమిత్తం అక్షయ్ కుమార్ తన గ్రామం నుంచి పెద్దపల్లికి ప్రతి రోజు వస్తుంటాడు. బుధవారం పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై గ్రామానికి వెళ్తున్న తరుణంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతిచెందాడని తెలిపారు. మృతుడి తండ్రి రాజబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బసంత్‌నగర్ ఎస్‌ఐ స్వామి తెలిపారు.

ఒకరి ఆత్మహత్యాయత్నం

సుల్తానాబాద్, జూన్ 20: సుల్తానాబాద్ పట్టణంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఎల్కతుర్తి మండలం వల్భాపూర్ గ్రామానికి చెందిన బాబురావు సోదరి నిర్మల మండలంలోని నీరుకుళ్లలో బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. అయితే అమె ఆత్మహత్యకు భర్త కారణమంటూ మృతురాలి సోదరుడు బాబురావు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు పోలీసులతో చర్చలు జరుగుతున్నాయి. నష్టపరిహారం కోసం మాట్లాడుతున్న సందర్భంలో బాబురావు తన వద్ద సిద్ధంగా ఉంచుకున్న గడ్డిమందు డబ్బా మూత తీసి అందరి ముందే తాగాడు.

అక్కడున్న వారు వెంటనే అతని చేతిలో నుంచి డబ్బా లాగి పడేసి అతన్ని సుల్తానాబాద్ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అనం తరం కరీంనగర్ తరలించారు. తన సోదరి విషయంలో కేసు నమోదులో జాప్యం జరుగుతుండటం, న్యాయం జరిగే అవకాశం లేదని అనుకున్న బాబురావు ఆత్మహత్యయత్నం చేశాడు. అయితే నీరుకుళ్ల మహిళ ఆత్మహత్య కేసులో గురువారం సాయంత్రమే ఫిర్యాదు అందిందని ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో బీడీ టేకేదార్ మృతి


మహేశ్(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, జూన్ 20: ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి బస్టాండు ప్రాంతంలో కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై గురువారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో గొల్లపల్లి గ్రామానికి చెందిన బీడీ టేకేదార్ ఊరడి మహేశ్(37) అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. అతని పైనుంచి కంటైనర్ వాహనం పోవడంతో ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గ్రామంలోని విజయ-వరస్వామి దంపతుల పెద్ద కొడుకు మహేశ్ స్థానికంగా బీడీ కంపెనీ నిర్వహిస్తూ జీవిస్తుండేవాడు. గొల్లపల్లి బస్టాండు ప్రాంతంలో ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్లేందుకు యూ టర్న్ తీసుకుంటున్న క్రమంలో కామారెడ్డి నుంచి సిరిసిల్ల వైపునకు ప్రయాణిస్తున్న కంటైనర్ వాహనం బైక్‌ను ఢీకొట్టి ముందుకు దూసుకుపోయింది. మహేశ్‌పై నుంచి వాహనం వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అక్కడకు చేరుకుని కన్నీరుమున్నీరుగా రోధించారు. సమాచారం అందుకున్న సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలోని పోలీసులు అక్కడకు చేరుకున్నారు. కంటేనర్ వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు. మృతుడికి తల్లిదండ్రులు విజయ, వరస్వామి, భార్య లావణ్య కూతురు లాస్య, కొడుకు మనోజ్ ఉన్నారు.

రెండు బైక్‌లు ఢీకొని ఐదుగురికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, జూన్ 20: ఎదురుగా వస్తున్న ఓ ద్విచక్రవాహనాన్ని అతివేగంగా ఢీకొట్టడంతో పాటు మరో బైక్‌ను ఢీకొన్న సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్ గ్రామ శివారులోని అర్బన్ పార్కు వద్ద గురువారం జరిగింది. ఈ ప్రమాదంలో ఐదుగురు తీవ్ర గాయాల పాలయ్యారు. క్షతగాత్రులను ఓ ప్రైవేటు వాహనంలో మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వాహనాలను ఢీకొట్టిన యువకుడు రాజేశ్‌ను 108 వాహనంలో సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. ప్రత్యక్ష సాక్షులు, పోలీసుల కథనం మేరకు.. మండలంలోని పదిర గ్రామానికి చెందిన రేండ్ల దేవరాజు తన భార్య కావ్య, కూతురు రియాన్ష్‌లతో కలిసి తన బైక్‌పై సిరిసిల్లకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్నాడు. ఎల్లారెడ్డిపేట నుంచి సిరిసిల్ల వైపునకు మద్యం మత్తులో బైక్‌పై అతివేగంగా దూసుకుపోయిన యువకుడు రాజేశ్ ముందుగా దేవరాజు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. వారి వెనుక వస్తున్న గొల్లపల్లిలోని డిగ్రీ విద్యార్థులు ఇరుముల శ్రీమాంత్, వంశీల వాహనాన్ని ఢీకొట్టి ముందుకు పోయాడు. దేవరాజు, కావ్య, రాజేశ్, శ్రీమాంత్, వంశీలకు తీవ్ర గాయాలయ్యాయి. స్వల్ప గాయాలతో చిన్నారి రియాన్ష్ బయటపడింది. కేసు నమోదు చేనట్లు పోలీసులు వివరించారు.


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కావ్య

ఇద్దరు దొంగల అరెస్టు

కరీంనగర్ క్రైం, జూన్ 20: కరీంనగర్‌లోని మెహర్‌నగర్‌లో ఈ నెల 15న చెయిన్ స్నాచింగ్‌కు పాల్పడిన ఇద్దరు నిందితులను గురువారం అరెస్టు చేశామని మూడో ఠాణా పోలీసులు తెలిపారు. మెహర్‌నగర్‌కు చెందిన సందూరి లక్ష్మి మెడలోని పుస్తెల తాడును తెంపుకుని పారిపోయిన నిందితులు విద్యానగర్‌లో నివాసం ఉంటున్న పున్నం శ్రీనివాస్, సాయినగర్‌కు చెందిన అందె శ్రీనివాస్‌లను ఆదర్శనగర్‌లో అరెస్టు చేశామని తెలిపారు. నిందితుల వద్ద నుంచి 7 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

హోటళ్లు, హాస్పిటల్స్‌పై బల్దియా అధికారుల దాడులు

కరీంనగర్ టౌన్, జూన్20: నగరంలోని పలు హోటళ్లు, హాస్పిటళ్లపై నగర పాలక సంస్థ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. గురువారం నాలుగు హోటళ్లు, రెండు హాస్పిటల్స్‌ను అసిస్టెంట్ కమిషనర్ జనార్ధన్ ఆధ్వర్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు తనిఖీలు నిర్వహించారు.

ఈ సందర్భంగా బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్‌ను పాటించకపోవడం, ఇతరత్రా నిబంధనలకు విరుద్ధంగా వాటిని నిర్వహిస్తున్నట్లు గుర్తించిన సంస్థల నుంచి 9,500 రూపాయల జరిమానా వసూలు చేశారు. తిరిగి ఇలాంటి చర్యలకు పాల్పడితే చట్టప రంగా శిక్షిస్తామని అసిస్టెంట్ కమిషనర్ హెచ్చరించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత


ఇసుక డంపును పరిశీలిస్తున్న ఎస్సై

తిమ్మాపూర్, జూన్ 20: మండలంలోని రేణికుంట సమీపంలోని మోయతుమ్మెద వాగు నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను ఎల్ఎండీ పోలీసులు గురువారం తెల్లవారు జామున పట్టుకున్నారు. రేణికుంట గ్రామ శివారులో నిల్వ చేసిన సుమారు 20ట్రాక్టర్లకుపైగా ఉన్న ఇసుక డంపులను కూడా స్వాధీనం చేసుకొని రెవెన్యూ శాఖకు అప్పగించామని ఎస్సై చేరాలు తెలిపారు.

అత్యాచారయత్నం చేసిన వ్యక్తి రిమాండ్

హుజూరాబాద్, జూన్ 20: హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని గ్రామానికి చెందిన ఓ వివాహితపై అత్యాచారయత్నానికి పాల్పడిన ట్రాన్స్‌కో ఉద్యోగి షాబుద్దీన్‌ను గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. గోదావరిఖనికి చెందిన సదరు మహిళ కొంతకాలంగా గ్రామంలో టైలరింగ్ పనిచేసుకుంటూ నివాసం ఉంటోంది. ఈ క్రమంలో షాబుద్దీన్ అనే వ్యక్తి ఇంట్లో ఎవరూ లేని సమయంలో వివాహితపై అత్యాచారయత్నానికి ప్రయత్నించాడు. ఆమె తప్పించుకొని విషయాన్ని బంధువులకు తెలిపింది. వివాహిత ఫిర్యాదు మేరకు షాబుద్దీన్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

పోక్సో చట్టం కింద ఒకరి అరెస్టు

మెట్‌పల్లి, జూన్, 20 : పట్టణానికి చెందిన బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన బత్తిని నవదీప్‌ను పోక్సో చట్టం కింద అరెస్టు చేసి గురువారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మెట్‌పల్లి పట్టణ అనుసంధాన గ్రామమైన ఆరపేటకు చెందిన బత్తిని నవదీప్ పట్టణానికి చెందిన బాలికపై లైగింక వేధింపులకు పాల్పడినట్లు బాలిక తల్లి ఈ నెల 12న పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపి పోక్సో చట్టం కింద అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఆర్టీసీ ఈడీని కలిసిన రీజియన్ మేనేజర్లు


ఆర్టీసీ ఈడీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న రీజినల్ మేనేజర్‌లు

భగత్‌నగర్, జూన్ 20: వరంగల్, ఖమ్మం రీజియన్‌లకు నూతన రీజినల్ మేనేజర్లుగా నియమితులైన డి విజయభాను, ఎ సరిరాంలు బుధవారం కరీంనగర్‌లోజోన్ ఈడీ సి వినోద్‌కుమార్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. రీజినల్ మేనేజర్‌లుగా పదోన్నతి పొందిన ఇద్దరిని జోన్ ఈడి వినోద్‌కుమార్ అభినందించారు. డి విజయభాను గతంలో చార్మినార్ డివిజన్ డిప్యూటీ రీజినల్ మేనేజర్ (ఆపరేషన్స్‌గా), ఎ సరిరాం రీజియన్‌లో డిప్యూటీ రీజినల్ మేనేజర్ (మెకానికల్)గా పనిచేశారు.

ఆర్టీసీ కరీంనగర్ ఒకటో డీఎం సస్పెన్షన్

భగత్‌నగర్, జూన్ 20: కరీంనగర్ వన్ డిపో మేనేజర్ లక్కు మల్లేశంను ఆర్టీసీ సస్పెండ్ చేసింది. ఈ మేరకు గురువారం ఈడీ వినోద్‌కుమార్ ఆయనను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. కామారెడ్డి డిపో నుంచి కరీంనగర్ వన్ డిపోకు మేనేజర్‌గా దాదాపు ఏడాదిక్రితం వచ్చిన మల్లేశంపై ఫిర్యాదులు రావడంతో ఆయనను విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు చెబుతున్నారు. సస్పెండ్‌కు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడికాలేదు.

ఒకరిపై దాడి.. ముగ్గురిపై కేసు

ఎల్లారెడ్డిపేట, జూన్ 20: ఇల్లు పంపకం విషయంలో తలెత్తిన వివాదంలో ఎల్లారెడ్డిపేట మండలం పదిర గ్రామానికి చెందిన కుంభాల లక్ష్మారెడ్డిపై దాడి చేసిన సంఘటనలో అదే గ్రామంలోని కుంభాల సత్యంరెడ్డి, అతని భార్య మయూరి, ఎలుసాని మల్లారెడ్డిలపై కేసు నమోదు చేశామని ఏఎస్ఐ కిషన్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో లక్ష్మారెడ్డి, సత్యంరెడ్డి మధ్య తాతలు సంపాదించిన ఇల్లు విషయంపై గొడవలు జరుగుతున్నాయి. తమను మోసగించి సత్యంరెడ్డి తన పేరిట చేయించుకున్నాడని లక్ష్మారెడ్డి పేర్కొంటున్నారు. ఈ విషయంలో పెద్దల సమక్షంలో పంచాయతీ నిర్వహించగా ఇల్లు వాటా కింద సోదరుడు లక్ష్మారెడ్డికి రూ.5 లక్షలు చెల్లిస్తానని అంగీకరించారు. యేడాది కిందట సత్యంరెడ్డి రూ.2లక్షలు మధ్యవర్తి ఎలుసాని మల్లారెడ్డికి అప్పగించాడని చెప్పారు. దాంట్లో నుంచి రూ.10 వేలు పట్టుకుని మిగతా డబ్బులు లక్ష్మారెడ్డికి ముట్టజెప్పాడని పేర్కొన్నారు. యేడాది గడిచినా డబ్బులు ఇవ్వకపోవడంతో ఈ నెల 20న మల్లారెడ్డి ఇంటికి వెళ్లి తన డబ్బులు చెల్లించాలని లక్ష్మారెడ్డి కోరాడని తెలిపారు. ఈ క్రమంలో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సత్యంరెడ్డి అతని భార్య మయూరి, ఎలుసాని మల్లారెడ్డిలు అడ్డగించి కర్రలతో దాడికి దిగారని లక్ష్మారెడ్డి చెప్పారు. లక్ష్మారెడ్డి తీవ్ర గాయాల పాలయ్యాడని పేర్కొన్నారు. బాధితుడి భార్య రేణుక ఫిర్యాదు మేరకు సత్యంరెడ్డి, మయూరి, మల్లారెడ్డిలపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఏఎస్ఐ కిషన్‌రావు వివరించారు.

ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న రైతులు, బీజేపీ నాయకులు

కోనరావుపేట, జూన్ 20: కోనరావుపేట మండల కేంద్రంలో ప్రధానమంత్రి మోడీ చిత్రపటానికి బిజెపి నాయకులు, రైతులు గురువారం క్షీరాభిషేకం చేశారు. ప్రధానమంత్రి 14 రకాల పంటలకు మద్దతు ధర పెంచడంపై బీజేపీ నాయకులు, రైతులు సంతోషం వ్యక్తం చేస్తూ క్షీరాభిషే కం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు గోపాడి సురేందర్ రావు, అంబోజ లక్ష్మీనారాయణ, జింక వెంకటి, మోత్కు మోహన్, మిర్యాల్‌కా ర్ బాలాజీ, నాగరాజు, మోహన్, జయంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామోజీరావుకు ఘన నివాళి

గంభీరావుపేట, జూన్ 20: గంభీరావుపేట మండల కేంద్రంలోని మా అనాథ వృద్ధాశ్రమంలో అక్షర యోధుడు రామోజీరావుకు గురువారం ఘన నివాళులు అర్పించారు. వృద్ధాశ్రమం నిర్వాకులు మల్లుగారి నర్సాగౌడ్, అనాథ వృద్ధులు రామోజీరావు చిత్ర పటానికి పూలమాలలు వేసి, ఘన నివాళి అర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించి, వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించారు.

అదుపు తప్పిన ఇసుక ట్రాక్టర్

ఎల్లారెడ్డిపేట, జూన్ 20: మండల కేంద్రంలోని రెండవ బైపాస్ రోడ్డులో గురువారం ఇసుక ట్రాక్టర్ అదుపు తప్పింది. ఆటోను తప్పించబోయి రహదారి పక్కకు దూసుకుపోయింది. డ్రైవర్ అప్రమత్తమై వాహనం నుంచి కిందకు దూకడంతో ప్రమాదం తప్పింది.

విద్యార్థులకు శుద్ధజలం అందించడం అభినందనీయం

ఎల్లారెడ్డిపేట, జూన్ 20: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు శుద్ధ జలం అందించేందుకు యువజన సంఘం సభ్యులు ముందుకు రావడం అభినందనీయమని ఎంపీడీవో సత్తయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం సింగారం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో స్థానిక సింగారం హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్ ప్యూరిఫైర్ పరికరాన్ని స్థానిక నాయకులు, సభ్యులతో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సత్తయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతోందని అన్నారు. సర్కారు విద్యార్థులకు ఆధునిక వసతులతో కూడిన విద్యను అందించేందుకు కృషి చేస్తోందని అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మధు, మాజీ సర్పంచ్ నర్సాగౌడ్, సభ్యులు నాగరాజు, దేవరాజు, దేవయ్య, సురేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు పింఛన్ అందించాలి

ముస్తాబాద్, జూన్ 20: అర్హులైన పేదలకు బీడీ పెన్షన్లు, ఆసరా పెన్షన్లు మంజూరు చేయాలని ముస్తాబాద్ మండల పరిషత్ కార్యాలయం ఎదుట పోతుగల్ గ్రామస్థులు గురువారం ఆందోళన చేశారు. ముస్తాబాద్ మండల పరిషత్ కార్యాలయం ఎదుట పోతుగల్ గ్రామ మహిళలు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. బీజేపీ నాయకులు కోల కృష్ణగౌడ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో ఆపార్టీని ప్రజలు బొంద పెట్టారని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసి 200 రోజులు కావొస్తున్న హామీలను అమలు చేయడంలో విఫలమైందని మండిపడ్డారు. ఆసరా పెన్షన్, బీడీ పెన్షన్‌లను అర్హులైన వారందరికీ అలాగే వికలాంగుల పెన్షన్‌లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మహాలక్ష్మీ పథకం వెంటనే అమల్లోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శక్తి కేంద్ర ఇన్‌చార్జి చీకోటి మహేశ్, బీజేపీ నాయకులు కస్తూరి కార్తీకరెడ్డి, చిట్నేని శ్రీనివాస్‌రావు, నాంపెల్లి, కనుకయ్య, రంజిత్, వినయ్, అకాశ్, మధు, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన సెస్ పాలకవర్గం



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాన్ని అందిస్తున్న సెస్ పాలకవర్గ సభ్యులు

సిరిసిల్ల కలెక్టరేట్ జూన్ 20: రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్‌గా నూతనంగా విధుల్లో చేరిన సందీప్ కుమార్ ఝాను గురువారం సెస్ పాలకవర్గం మర్యాదపూర్వకంగా కలిశారు సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ లో సెస్ ఛైర్మన్ చిక్కాల రామారావు ఆధ్వర్యంలో పాలకవర్గ సభ్యులు జిల్లా కలెక్టర్‌కు పూల మొక్కలను అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్ర మంలో సెస్ వైస్ ఛైర్మన్ దేవరకొండ తిరుపతి, సెస్ ఎండీ, డైరెక్టర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

కేంద్ర మంత్రి 'బండి'ని కలిసిన బీజేపీ నాయకులు

బోయినపల్లి, జూన్ 20: హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను గురువారం మండల బీజేపీ నాయకులు కలిసి గజమాలతో సత్కరించి, ఆధునిక కవి గుంటూరు శేషేంద్ర శర్మ గారి ఆధునిక మహాభారతం పుస్తకాన్ని బహూకరించి బోయినపల్లి మండలంలోని గ్రామాల ప్రజలందరి తరఫున శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి పరశురామ్ ఎడపల్లి, కిసాన్ మోర్చ మండల అధ్యక్షులు అమిరిశెట్టి గంగయ్య, ప్రదీప్, వినయ్, ప్రసాద్, శ్రీనివాస్, కార్యకర్తలు పాల్గొన్నారు..

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలి

కోనరావుపేట, జూన్ 20 : కోనరావుపేట మాజీ సర్పంచ్ పోకల రేఖసంతోష్ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కలిసి కోనరావుపేట అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని వినతి పత్రం గురువారం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ రేఖసంతోష్ మాట్లాడుతూ కోనరావుపేట మండల కేంద్రంలోని బస్టాండ్ నుండి పశువుల ఆసుపత్రి వరకు డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు ఇప్పించాల్సిందిగా కోరామని తెలిపారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పందించారని నిధులు మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



గ్రామస్థులతో మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వర్లు

రుద్రంగి, జూన్ 20: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చందుర్తి సర్కిల్ సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు గురువారం రాత్రి రుద్రంగి మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో 'పోలీస్ మీకోసం' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఆరుబయట నిద్రించేటప్పుడు మహిళలు ఆభరణాలు వేసుకొని నిద్రించవద్దని, రాత్రి సమయంలో దొంగతనాలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా బాధితులు సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930కు లేదా స్థానిక పోలీస్ స్టేషన్లో సమాచారం అందించాలని అన్నారు. ప్రతీ ఒక్కరు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. యువకులు మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని, ఎవరైనా మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నప్పుడు వెంటనే సీఈఐఆర్ అప్లికేషన్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై సిరిసిల్ల అశోక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేయించాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా - జిల్లా వ్యాప్తంగా నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ



చందుర్తిలో మాత్రలను పంపిణీ చేస్తున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



సిరిసిల్లలో జడ్పీ చైర్‌పర్సన్ అరుణ..



వంతడుపులలో వైస్ ఎంపీపీ శ్రీనాథ్‌గౌడ్..

చందుర్తి, జూన్ 20: ఏడాది నుంచి 19 ఏండ్ల లోపు వయసు పిల్లలు, విద్యార్థులందరికీ అల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేయించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పిలుపునిచ్చారు. నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా చందుర్తి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులకు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా గురువారం అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. అనంతరం విద్యాలయంలోని తరగతి గదులు, వంటగదిలో మెనూ పరిశీలించి, సిద్ధం చేస్తున్న ఆహార పదార్థాలను చూసి, వంట చేస్తున్న వారితో మాట్లాడారు. విద్యాలయంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? ఎంత మంది విద్యార్థులు ఉన్నారో ఎస్‌వో కల్పనను అడిగి తెలుసుకున్నారు. విద్యాలయం ఆవరణ పరిశీలించి, పరిసరాలను శుభ్రం చేయించి, విద్యార్థినుల కోసం ఆట స్థలం సిద్ధం చేయించాలని ఎంపీడీవోను ఆదేశించారు.

ఇల్లంతకుంట: మండలంలోని అన్ని గ్రామాలలో నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ గురువారం జరిగింది. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ సుదగోని శ్రీనాథ్‌గౌడ్, ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్యయాదవ్, ఎంపీడీఓ శ్రీనివాసమూర్తి, వైద్యాధికారిణి శరణ్య, వైద్యసిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు వేశారు. ప్రతీ ఆరు నెలలకు ఒకసారి పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు వేయడం వల్ల కడుపులో పెరిగే నట్టలను పూర్తి స్థాయిలో నివారించవచ్చని లింగన్నపేట ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో వైద్యులు అరుణ, అఖిల్, సీహెచ్ రమేష్, కేజీబీవీ అధ్యాపకులు, ఏఎన్ఎంలు ఉన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంతో పాటు బొప్పాపూర్, గొల్లపల్లి, నారాయణపూర్, బండలింగంపల్లి, పదిర, హరిదాస్‌నగర్, వెంకటాపూర్, గుండారం, తిమ్మాపూర్, కోరుట్లపేట, అక్కపల్లి, దుమాల, తదితర గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రవేటు విద్యా సంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులు, చిన్నారులకు స్థానిక ప్రజాప్రతినిధులు, వైద్య అధికారులతో కలిసి గురువారం మాత్రలను పంపిణీ చేశారు. ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లో మొత్తం 15,967 మంది పిల్లలను గుర్తించి 13,357 మంది పిల్లలకు మాత్రలను పంపిణీ చేశామని పీహెచ్‌సీ ఇన్‌చార్జి వైద్యులు స్రవంతి, చిరంజీవి పేర్కొన్నారు. మిగిలిన పిల్లలకు ఈ నెల 27న అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ రేణుక, ఎంపీడీవో సత్తయ్య, ఎంపీటీసీలు, వైద్య సిబ్బంది, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

● నులి పురుగులను పూర్తిస్థాయిలో నివారించాలి

సిరిసిల్ల రూరల్: పిల్లలందరికి ఆల్బెండజోల్ మాత్రలు వేసి నులి పురుగులను పూర్తిస్థాయిలో నిర్మూలించాలని జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణరాఘవరెడ్డి కోరారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా సిరిసిల్ల పట్టణం గీతానగర్ ఎంపీపీఎస్ పాఠశాలలో గురువారం నిర్వహించిన నులిపురుగుల నివారణ దినోత్సవానికి మున్సిపల్ ఛైర్‌పర్సన్ జిందం కళచక్రపాణి, జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్‌తో కలిసి పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను వేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో రజిత, మున్సిపల్ కమిషనర్ లావణ్య, ప్రోగ్రాం ఆఫీసర్ నహీమా, సీడీపీవో అలేఖ్య, డాక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: 19 ఏళ్ల లోపు పిల్లలు నులి పురుగు నివారణ మాత్రలు వేసుకోవాలని మండల వైద్యాధికారి డా. చిరంజీవి అన్నారు. వీర్నపల్లి మండలంలోని ఆయా గ్రామాల పాఠశాలలో జాతీయ నులి పురుగు నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం విద్యార్థులకు నులి పురుగు నివారణ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పిల్లల పొట్టలో నులిపురుగులు చేరితే రక్తహీనత, ఆకలి మందగించడం, పోషకాహార లోపం, వికారం, వాంతులు, విరోచనాలు, బరువు తగ్గడం వంటి అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని సూచించారు. కార్యక్రమంలో ఎమ్ఎల్‌హెచ్‌పీ చైతన్య, సూపర్‌వైజర్లు పద్మ, రేణుక, ఏఎన్ఎంలు మంజుల, ఇందిర, కీర్తి, సుజాత, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రుద్రంగి: మండల కేంద్రంలో జిల్లా పరిషత్‌ఉన్న పాఠశాల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గంగం స్వరూపరాణి మహేష్, జడ్పీటీసీ గట్ల మీనయ్య, ఎంపీడీవో నటరాజ్, ఎంపీటీసీ మంచె లావణ్య రాజేశం, కార్యదర్శి రామ్‌దాస్, ఆదికారులు, తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: మండలంలోని మోడల్ స్కూల్లో విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీపీ చంద్రయ్య గౌడ్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నులిపురుగుల నివారణ మాత్రలు 19 సంవత్సరాలు లోపు పిల్లలు అందరు వేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సాగర్, ఎంపీటీసీ చారి ఉన్నారు.

91.22 శాతం పంపిణీ

సిరిసిల్ల, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లాలో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ 91.22 శాతం పూర్తి చేశారు. జిల్లాలోని 15 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా 1,42,152 మందికి మాత్రల పంపిణీ లక్ష్యంగా పెట్టుకోగా 1,29,673 మందికి మాత్రలు పంపిణీ చేశారు.

ప్రాథమిక ఆరోగ్యకేంద్రం	లక్ష్యం	పంపిణీ
బోయినపల్లి	2,314	2,162
చందుర్తి	13,433	12,761
చీర్లవంచ	5,396	4,924
హన్మాజిపేట	23,818	21,908
ఇల్లంతకుంట	9,306	8,796
కొదురుపాక	1,410	844
కోనరావుపేట	9,637	9,248
లింగన్నపేట	11,400	9,690
ఎల్లారెడ్డిపేట	15,962	13,965
నేరేళ్ల	10,300	9,721
తంగళ్లపల్లి	9,724	9,211
విలాసాగర్	718	598
ఏటీనగర్	13,309	12,208
పీఎస్‌నగర్	11,232	9,685
మొత్తం	**1,42,152**	**1,29,673**



రుద్రంగిలో ఎంపీడీవో నటరాజ్..



ఎల్లారెడ్డిపేటలో డాక్టర్ స్రవంతి, ఎంపీపీ రేణుక..



వీర్నపల్లిలో మాత్రలు వేస్తున్న వైద్య సిబ్బంది

ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

- డీఈవోకు వినతిపత్రం అందించిన ఎస్ఎఫ్ఐ నాయకులు



డీఈవోకు వినతిపత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సిరిసిల్ల కలెక్టరేట్, జూన్ 20: జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్కులు, యూనిఫాంలను అమ్ముతున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ విద్యాశాఖ కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా విద్యాధికారి ఏ రమేష్‌కుమార్‌ను గురువారం కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మల్లారపు ప్రశాంత్ మాట్లాడుతూ జిల్లాలో విద్యాసంవత్సరం ప్రారంభంలోనే ప్రైవేటు, కార్పొరేట్ యాజమాన్యాలు విద్యను వ్యాపారం చేస్తూ విచ్చలవిడిగా పాఠశాల ఆవరణలోనే నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు ఇతర స్టేషనరీ మొత్తం కూడా అమ్ముతూ పేద విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేసి విద్యను వ్యాపారం చేస్తున్నారని వేల రూపాయలు పాఠ్యపుస్తకాల పేరిట వసూలు చేస్తున్నారన్నారు. అదేవిధంగా జిల్లాలో కొన్ని కార్పొరేట్ పాఠశాలలు అనుమతులు లేకుండా నడుస్తున్నాయని అడ్మిషన్లు చేస్తున్నారని వెంటనే అలాంటి పాఠశాలలపై చర్యలు తీసుకుని పాఠశాలలను సీజ్ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దీంతో స్పందించిన విద్యాధికారి రమేష్‌కుమార్ జిల్లాలో ఉన్న ప్రతి ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలను తనిఖీ చేసి నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు అమ్మిన అధిక ఫీజులు వసూలు చేసిన అనుమతులు లేని పాఠశాల జిల్లాలో ఉన్న సీజ్ చేసి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జాలపల్లి మనోజ్ కుమార్, నాయకులు రజినీకాంత్, శ్రీకాంత్ మహేష్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల లేబర్ కార్డులకు వేలిముద్రను రద్దు చేయాలి

కోనరావుపేట, జూన్ 20: భవన కార్మికుల లేబర్ కార్డులకు వేలిముద్రను రద్దు చేయాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు కోరారు. కోనరావుపేట మండల కేంద్రంలో సుతారి సంఘం కార్మికులతో సమావేశం నిర్వహించి గురువారం మాట్లాడారు. సిమెంట్ పనులు చేస్తున్న కార్మికుల వేలిముద్రలు రావడం లేదని అన్నారు. పెండింగ్‌లో ఉన్న సహజ మరణం యాక్సిడెంట్ డెలివరీ, మ్యారేజ్ బెనిఫిట్స్ వెంటనే అమలు చేయాలని కోరారు. అర్హులైన కార్మికులందరికీ కొత్త కార్డులు జారీ చేయాలని కోరారు. ఈ సందర్భంగా బొల్లె బాబు, శ్రీనివాస్, రాజయ్య, దేవరాజు పాల్గొన్నారు.

ఘనంగా శకటోత్సవం

ఇల్లంతకుంట, జూన్ 20: మండలంలోని కందికట్కూర్ గ్రామంలోని రేణుకాదేవి ఆలయం చట్టు బండ్ల ప్రదక్షణ ఘనంగా జరిగింది. రేణుకాదేవి ఉత్సవాలలో భాగంగా గురువారం ఎల్లమ్మతల్లికి బోణాలు తీశారు. ఆలయం చుట్టు బండ్లను తిప్పడానికి పోటీపడ్డారు. వివిధ గ్రామాల భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు.

గోపాలరావుపల్లె సర్పంచ్ స్థానానికి ఎస్సీ రిజర్వేషన్ అమలు చేయాలి

తంగళ్లపల్లి, జూన్ 20: తంగళ్ళపల్లి మండలం గోపాలరావు పల్లె గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానానికి ఎస్సీ రిజర్వేషన్ అమలు చేయాలని ఆర్డీవోకు ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన గుండు ప్రేమ్‌కుమార్ తదితరులు వినతిపత్రం సమర్పించారు. గత 20 సంవత్సరాలుగా ఎస్సీ రిజర్వేషన్ అవకాశం రాలేదని, రాబోయే ఎన్నికల్లో జనాభా నిష్పత్తి ప్రకారం గోపాలరావుపల్లె గ్రామానికి ఎస్సీ సర్పంచ్ రిజర్వేషన్ అమలు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

తంగళ్లపల్లి, జూన్ 20: మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సుధాకర్ హెచ్చరించారు. గురువారం రాత్రి తంగళ్లపల్లి మండల కేంద్రంలో మండేపల్లి చౌరస్తాలో ఎస్ఐ సుధాకర్ ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేశారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎవరైనా బహిరంగ ప్రదేశంలో మద్యం సేవించినా, మద్యం సేవించి వాహనాలు నడిపినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రమాదకరంగా ఉన్న చెట్లను తొలగించాలి

ఎల్లారెడ్డిపేట, జూన్ 20: ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి బస్టాండ్ ప్రాంతంలో కామారెడ్డి సిరిసిల్ల ప్రధాన రహదారి డివైడర్ మధ్యలో ప్రమాదకరంగా మారిన చెట్లను తొలగించాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శి రామకృష్ణకు స్థానిక యువకులు గురువారం వినతి పత్రం సమర్పించారు. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా స్పందించి చెట్ల కొమ్మలను తొలగించి ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో యువకులు సతీష్, తదితరులు పాల్గొన్నారు.

నేడు పదిరలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ

ఎల్లారెడ్డిపేట, జూన్ 20: ఎల్లారెడ్డిపేట మండలం పదిర గ్రామంలో బస్టాండు ప్రాంతంలో ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ హాజరు కానున్నారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య గురువారం తెలిపారు. ఉదయం 11 గంటలకు విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని ఆగయ్య కోరారు.

గొల్లకురుమలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

- కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సంఘు స్వామి

వేములవాడ టౌన్, జూన్ 20: గొల్లకురుమలు అధైర్యపడవద్దని కాంగ్రెస్ ప్రభుత్వ అండగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సంఘు స్వామి యాదవ్ అన్నారు. వేములవాడ పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గొర్రెల స్కామ్‌తో రూ. 700 కోట్లకు సంబంధించి గత ప్రభుత్వ పాలకులకు ఉచ్చుబిగుస్తోందని అన్నారు. గొర్రెల స్కామ్‌తో సంబంధం వున్న ఏ ఒక్కరినీ విడిచిపెట్టేది లేదన్నారు. గత ప్రభుత్వాలు చేసిన తప్పులు చేయకుండా, ప్రతి గొల్లకురుమ కుటుంబానికి న్యాయం చేయాలన్నదే కాంగ్రెస్ పార్టీ ధ్యేయం అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో జిల్లా కలెక్టర్ ఖాతాల్లో వున్న డబ్బులను తిరిగి గొర్రెలకాపర్ల ఖాతాల్లోకి బదలాయించడం జరుగుతుందని సూచించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కృషితో డబ్బులు తిరిగి రావడం జరుగుతుందన్నారు. కూరగాయాల కొమురయ్య, కనికరపు రాకేష్, తోట రాజు, అంబాటి చంద్రశేఖర్, లింగంపల్లి కిరణ్ ఉన్నారు.

జిల్లా విద్యాధికారిపై చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన ఏబీవీపీ నాయకులు



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న ఏబీవీపీ నాయకులు

సిరిసిల్ల కలెక్టరేట్, జూన్ 20: జిల్లా విద్యాశాఖ అధికారిపై చర్యలు తీసుకొని విద్యావ్యవస్థను కాపాడాలని ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేణి రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో గురువారం ఏబీవీపీ నాయకులు కలెక్టర్ సందీప్ కుమార్ ఝాను కలిసి విద్యాశాఖ అధికారి రమేష్‌కుమార్‌పై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ మాట్లాడుతూ కార్పొరేట్ విద్యాసంస్థల్లో నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు, బుక్స్ యూనిఫాంలను అమ్ముతున్నా విద్యాశాఖాధికారులకు కనిపించడం లేదన్నారు. గతంలో ఈ విషయాలపై జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్‌కు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులు చేయడం జరిగిందన్నారు. విద్య వ్యవస్థను వ్యాపారాన్ని చేస్తూ రూ లక్షల్లో తల్లిదండ్రులనుంచి వసూలు చేస్తున్నారని అన్నారు. విద్యాసంవత్సర ఫీజులను సైతం ఇష్టానుసారంగా నిర్ణయించి అడ్మిషన్ ఫీజు, సెమిస్టర్ ఫీజు, పరీక్ష ఫీజు, అసైన్మెంట్ ఫీజు, స్టేషనరీ ఫీజు, అబ్సెంట్ ఫీజు అంటూ వివిధ రకాల పేర్లు పెట్టి విద్యార్థులను ఇబ్బంది పెట్టడమే పనిగా పెట్టుకున్నారని అన్నారు. అధిక ఫీజులను వసూళ్లు చేస్తున్న కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ ఎస్ఎఫ్‌డీ విభాగ్ కన్వీనర్ లోపెల్లి రాజు, ఖేల్ కన్వీనర్ ఎలగందుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.